సాక్షి అనకాపల్లి

శనివారం, 12, ఆగస్టు, 2023



సాంస్కృతిక వైభవం

విశాఖ: టీటీడీ కల్యాణ మండపంలో శ్రావణ సంగీతోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.



కనకమ్మకు క్షీరాభిషేక సేవ

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

స్వల్ప వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల నాలుగురోజులు స్వల్ప వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12న 1 మి.మీ., 13న 1, 15న 2, 16న 4 మి.మీ. చొప్పున వర్షం కురుస్తుందన్నారు. ఉష్ణోగ్రతలు 32.8 నుంచి 34.8 డిగ్రీలుగా నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

మహిళలకు ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఎంపీ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: అనకాపల్లి మండలం కోడూరులో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కులో మహిళల కోసం ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని కేంద్ర ఎంఎస్ఎంఈ సహాయమంత్రి భానుప్రతాప్ వర్మకు అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి విజ్ఞప్తి చేశారు. ఆమె శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రితో భేటీ అయి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

అప్రెంటిస్‌షిప్ మేళాకు విశేష స్పందన



రాత పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులు

నర్సీపట్నం: ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన అప్రెంటిస్‌షిప్ మేళాకు వివిధ ట్రేడులకు సంబంధించిన అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వారు శుక్రవారం ఐటీఐలో ఈ మేళా నిర్వహించారు. మేళాకు వచ్చిన 64 మంది విద్యార్థులకు రాత పరీక్ష పెట్టారు. రాత పరీక్ష అనంతరం సంస్థ జనరల్ మేనేజర్ రంగారావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ డి.శ్రీనివాసాచారి తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లిటౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)-2023 పరీక్షకు జిల్లాలో 8వ తరగతి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. డిసెంబర్ 3న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతిసౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న, ఏడాదికి రూ.3.50 లక్షల కుటుంబ ఆదాయం గల విద్యార్థులు అర్హులని తెలిపారు. సెప్టెంబర్ 15వతేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పరీక్ష రుసుం చెల్లించేందుకు అదే నెల 16వతేదీ వరకు గడువు ఉందన్నారు. పరీక్షరాసే జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తులు, సంబంధిత ధ్రువీకరణపత్రాలు ప్రింట్‌తీసి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అదేనెల 19వలోగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

ఎన్నికల సందర్భంగా 18,19 తేదీల్లో సెలవు

తుమ్మపాల: సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక నేపథ్యంలో ఈ నెల 18,19 తేదీల్లో సెలవు ప్రకటిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ కేంద్రాలుగా వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు మాత్రమే సెలవు వర్తిస్తుందని తెలిపారు. పోలింగ్ ప్రాంతాల్లో మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్టు ప్రకటించారు.

నైపుణ్యాభివృద్ధికి టీఆర్ఈఐతో గైస్ ఒప్పందం



టీఆర్ఈఐ కంపెనీ ప్రతినిధులతో పత్రాలు మార్చుకుంటున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాభివృద్ధికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు అచ్యుతాపురంలోని టయోట్స్ రేర్ ఎర్త్స్ (టీఆర్ఈఐ) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఇండస్ట్రీ కనెక్ట్‌లో భాగంగా ఆ కంపెనీ ప్రతినిధులతో గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ సమక్షంలో కాలేజీ ప్రతినిధులు శుక్రవారం అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకున్నారు. కరికులం డిజైన్, విద్యార్థులకు, ట్రైనర్లకు శిక్షణ, జాయింట్ సర్టిఫికేషన్, ఉద్యోగ కల్పనకు ప్రత్యేక శిక్షణ, ఇండస్ట్రియల్ ట్రైనింగ్, గెస్ట్ లెక్చరర్స్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలను టీఆర్ఈఐ నిర్వహిస్తుందని ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండీ కోయిచీ సాతో, సీనియర్ జీఎం డాక్టర్ మురళీధరరావు, కాలేజీ టీపీవో కుమార్ పాల్గొన్నారు.

మురిపించిన మువ్వన్నెలు



భారీ జాతీయ పతాకంతో విద్యార్థుల ర్యాలీ

మూడు రంగుల జాతీయ జెండా రెపరెపలాడింది. పొడవాటి పతాకాన్ని భుజాలపై మోస్తూ చిన్నారులు ఉత్సాహంగా ర్యాలీ జరిపారు. బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని **శుక్రవారం 75 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు.** హెచ్ఎం **శేఖర్ అధ్వర్యంలో పాఠశాల** నుంచి **ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు వారి భుజాలపై భారీ పతాకాన్ని మోస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో జెడ్పీటీసీ పోతల లక్ష్మీ** రమణమ్మ, **సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు** ఉలబాల సత్యవతి, పీహెచ్‌సీ వైద్యురాలు సునీత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి పోతల లక్ష్మి పాల్గొని జాతీయ పతాకం విశిష్టత గురించి మాట్లాడారు.

\- రోలుగుంట

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లా స్థాయి కార్యక్రమం జరిగే స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని జిల్లా అధికారులు శుక్రవారం పరిశీలించారు. జెండా ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ విభాగాల శకటాల ప్రదర్శన తదితర విషయాలను చర్చించారు. ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో ఎ.జె.చిన్నికృష్ణ, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, పట్టణ సీఐ దాడి మోహనరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా జిల్లా ఏర్పడిన తరువాత అనకాపల్లిలో రెండోసారి స్వాతంత్ర్య దినోత్సవం జరుగుతోందని, ఇందుకోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అతివలకు ఆర్థిక ఆసరా



ఎస్‌హెచ్‌జీ సభ్యులకు నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, చిత్రంలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, మెప్మా పీడీ సరోజిని

- 37,871 సంఘాలకు రూ.54.79 కోట్లు
- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం చెక్కు పంపిణీ

తుమ్మపాల: వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని మహిళలు సద్వినియోగపరచుకొని తమ కుటుంబాలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. డా.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నాలుగో ఏడాది సున్నా వడ్డీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా లబ్దిదారులతో కలిసి కలెక్టర్ వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం ఆర్థికంగా పురోగతి సాధించాలనే ఉద్దేశంతో సీఎం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ సున్నా వడ్డీ పథకం ద్వారా గత నాలుగేళ్లగా మహిళలు మంచి ప్రయోజనం పొందారని కలెక్టర్ అన్నారు. జిల్లాలో 37,871 సంఘాలకు చెందిన 4,27,972 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ.54.79 కోట్లను చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, మెప్మా పీడీ సరోజిని, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సమీక్షల నిర్ణయాలు తక్షణమే అమలు

- అధికారులకు డిప్యూటీ సీఎం పీడీక రాజన్నదొర ఆదేశం



చోడవరం నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: నియోజకవర్గాల సమీక్ష సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను తక్షణమే అమలు చేయాలని డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర అధికారులను ఆదేశించారు. చోడవరం నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు (యాక్షన్ టేకెన్ రిపోర్టు) ఇవ్వాలన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అన్ని శాఖల అధికారుల సహాయసహకారాలు అవసరమన్నారు. సమన్వయంతో అభివృద్ధి చేసి జిల్లాను మొదటి స్థానంలోకి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గాల అభివృద్ధిపై సీఎం జగన్ ఆలోచనతో చేపట్టిన నియోజకవర్గాల సమీక్ష కార్యక్రమం డీడీఆర్సీ కన్నా మంచి ఫలితాలు ఇస్తుందని తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామ, మండల స్థాయిల్లో కూడా అర్జీలు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన నాలుగు నియోజకవర్గాల సమీక్షల్లో ఆయా ఎమ్మెల్యేలు సూచించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. చోడవరం నియోజకవర్గంలో కొన్నిచోట్ల రోడ్ల పరిస్థితిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలపగా సంబంధిత అధికారులు స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని, కొన్నింటికి మంజూరు కూడా లభించిందన్నారు. వెంకన్నపాలెంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని, జగనన్న కాలనీలో కోర్టు కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ధర్మశ్రీ కోరారు. ఈ అంశమై వెంటనే తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, డీసీహెచ్ఎస్ శావణ్‌కుమార్, గృహనిర్మాణ శాఖ పీడీ రమామణి, పంచాయతీ రాజ్ ఈఈ వీరునాయుడు, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, డీపీవో శిరీషారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారం వైఎస్సార్‌సీపీదే

- సున్నా వడ్డీ ద్వారా అక్కచెల్లెమ్మలకు ఆర్థిక చేయూత
- జెండా తప్ప అజెండాలేని పార్టీలు టీడీపీ, జనసేన
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



ముత్యాలనాయుడికి సత్కారం

నక్కపల్లి: సీఎం జగన్‌మోహనరెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సున్నా వడ్డీ ద్వారా డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఆర్థిక చేయూత అందిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ తమ ఆర్థిక అవసరాలు, చిన్న చిన్న వ్యాపారాల కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని వడ్డీలు కట్టలేక సతమతమవుతున్న అక్క చెల్లెమ్మలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఎన్నికల్లో అధికారంలోకి రావడం కోసం అమలు చేతకాని మేనిఫెస్టోలను ప్రకటించి.. అధికారం దక్కకపోవడంతో మేనిఫెస్టోలను మాయం చేసిన పార్టీలు ఇప్పుడు తిరిగి అధికారంలోకి రావడం కోసం రోడ్డెక్కి యాత్రలు చేస్తున్నాయని ముత్యాలనాయుడు ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేన పార్టీలకు జెండా తప్ప ఎజెండా లేదన్నారు.ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ వెలగా ఈశ్వరరావు పాల్గొన్నారు. ముత్యాలనాయుడిని ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న స్థాయీ సంఘం చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ పరిధిలో అన్ని జోన్లలో కోట్లాది రూపాయలతో చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం సభ్యులు ఆమోదం తెలిపారు. స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘం అజెండాలో 48 అంశాలు పొందుపరిచారని, అందులో అన్ని అంశాలను సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.8.29 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి రూ.73.15 లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగానికి రూ.65.55 లక్షల పనులు, రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపులతో పాటు తదితర అంశాలు ఆమోదించారన్నారు. ఈ సమావేశంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, ఆర్జీవీ కృష్ణ, సింహాచలం, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, డీసీపీలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్.. లాభాలు అమోఘం

కాసులు కురిపిస్తున్న ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంస్కరణలే అందుకు ప్రధాన కారణం. సంప్రదాయ పంటలతోపాటు వాణిజ్య పంటల సాగు చేపట్టి లాభాల బాట పడుతున్నారు. రాయితీలు, ప్రోత్సాహకాలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడంతో అవినీతికి తావు లేకుండా తక్షణ ప్రయోజనం పొందుతున్నారు.

- పెరుగుతున్న ఆదాయంతో రైతుల మొగ్గు
- రాయితీలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- మొక్క నుంచి పంట అమ్ముకునే వరకు ప్రైవేట్ సంస్థలతో అనుసంధానం
- ప్రతి నెలా 5వ తేదీన ధరల నిర్ణయం



ఆయిల్‌పామ్ తోటలో తోటబడి నిర్వహించిన హార్టికల్చర్ అధికారులు (ఫైల్)



గెలలతో ఉన్న ఆయిల్‌పామ్ మొక్క

చీడికాడ: జిల్లాలోని 24 మండలాల్లో 8 వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తున్నారు. దేశీయ, విదేశీ మొక్కలను పెంచుతూ 3,450 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. నాటిన నాలుగేళ్లకు ఆయిల్‌పామ్ చెట్లు పూతకొస్తాయి. అప్పటి నుంచి నెలకు 2 కోతల చొప్పున పంట చేతికొస్తుంది. అన్ని ఖర్చులు పోను ప్రస్తుత మార్కెట్ ధరను బట్టి ఎకరాకు రూ.70 వేల నుంచి 80 వేల వరకు రైతుకు ఆదాయం సమకూరుతోంది. 100 శాతం రాయితీతో ఆయిల్‌పామ్ మొక్కను అందించడంతో పాటు ఆ మొక్కలు నాటిన నాటి నుంచి అంతర పంటల సాగుకు ఏడాదికి హెక్టారుకు రూ.5,250 చొప్పున, అందిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చుల కింద మరో రూ.5,250 చొప్పున చెల్లిస్తున్నారు. అంతే కాకుండా మొక్క ఐదో ఏడు నుంచి ఎనిమిదో ఏడు వరకు అంతర పంట సాగుగా కోకోను ప్రోత్సహిస్తున్నారు. అందుకోసం కోకో సాగుకు ఎరువుల నిమిత్తం హెక్టారుకు ఏడాదికి రూ.2400 అందిస్తున్నారు. ఈ విధంగా మూడేళ్లపాటు హెక్టారుకు రూ.7,200ల వంతున ప్రభుత్వం నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తుంది.

మొక్క నుంచి కోత పనిముట్ల వరకు రాయితీపై అందజేత

గత ప్రభుత్వాలు పనిముట్లు అందించాలంటే రైతు వాటా తప్పనిసరి. ప్రభుత్వానికి నచ్చినవే ఇవ్వడంతో.. అవి నాసిరకంగా ఉంటే రైతు నష్టపోయేవాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొక్క నుంచి కోత సామగ్రి, ట్రాక్టర్లు, చాప్‌కట్టర్ల ఎంపికను రైతు అభీష్టానికే విడిచిపెట్టారు. దీంతో రైతు నాణ్యమైన మొక్కతోపాటు తనకు కావలసిన సామగ్రిని తీసుకుంటున్నాడు. బిల్లు సమర్పిస్తే ప్రభుత్వం ఆ సొమ్మును నేరుగా రైతు ఖాతాకు జమ చేస్తోంది. ఆయిల్‌పామ్ మొక్క అందించిన నాటి నుంచి అది పెరిగి పంట దశకు వచ్చే వరకు రైతుకు సాగు విధానంపై హార్టికల్చర్ అధికారులు, ప్రైవేట్ యాజమాన్యాలు తోటబడి కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం జిల్లాలో 3 ఎఫ్ లిమిటెడ్, శాంతి ఆయిల్ పామ్ లిమిటెడ్, పతంజలి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలతో ఎంవోయూలు చేసుకుంది.

ముందుగానే ఒప్పందాలు

ఆయిల్‌పామ్ రైతుకు ఎంత ప్రోత్సాహం లభిస్తోందంటే.. పంట కొనుగోలుకు ముందే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ ఏడాది జిల్లాలో 1250 హెక్టార్లలో కొత్తగా ఆయిల్‌పామ్ తోటలు పెంచాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 300 హెక్టార్లలో పూర్తి చేశారు. ప్రైవేట్ యాజమాన్యాలు రైతు కోరుకున్న మొక్కను అందించడంతోపాటు పంట కోసిన తరువాత కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ప్రతి నెల 5వ తేదీన ప్రభుత్వం నిర్ణయించే ధరకే ఆయిల్ గింజలకు ధర చెల్లిస్తారు. రెండేళ్లలో 50 శాతం ధరలు పెరిగాయి. టన్ను పామాయిల్ గింజల ధర సుమారు రూ.5,500 వరకు ఉండేది. నేడది రూ.12 వేల నుంచి 13 వేల మధ్యలో కొనసాగుతోంది. దీంతో రైతుకు మంచి ఆదాయం సమకూరుతుంది.

ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలివీ..

- ఉచితంగా మొక్కల పంపిణీ
- నాలుగేళ్లపాటు ఎరువులు, అంతర పంటల సాగుకు హెక్టారుకు రూ.10,500
- మరో మూడేళ్లపాటు అంతరపంటగా కోకో తోటల పెంపకానికి హెక్టారుకు రూ.7,200
- నీటి తడుల కోసం డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం రాయితీపై సామగ్రి అందజేత
- వానపాముల యూనిట్ ఏర్పాటు రూ.15 వేల ప్రోత్సాహకం
- గెలలు కోసే కత్తులు, పరికరాల కోసం రూ.7,500
- కమ్మలు, మట్టల కోత కోసం చాప్‌కట్టర్‌కు రూ.50 వేలు
- మినీ ట్రాక్టర్ కోసం రూ.2 లక్షల రాయితీ

రాయితీలతో పెరిగిన ఆసక్తి



ప్రభుత్వం వాణిజ్య పంటల సాగుకు అందిస్తున్న రాయితీలతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పాటు మా సిబ్బంది గ్రామాల్లో సాగులో ఉన్న రైతులకు ప్రత్యేకంగా పెంపకం, యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఏ నెలకి ఆ నెల మార్కెట్ రేటు తెలుస్తున్నందున మార్కెట్ విస్తరించడంతో రైతుకు పంట అమ్ముకోవడం సులభతరమైంది.

\-జి.ప్రభాకరరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి

తోట బడులతో అవగాహన



ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు హార్టికల్చర్ డిపార్ట్‌మెంటుతోపాటు ఎంవోయూ కుదుర్చుకున్న ప్రైవేట్ యాజమాన్యం సిబ్బంది తోటలతోకి వెళ్లి తోటబడుల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మొక్కల పెంపకం, గెలల పెరుగుదల, ఎరువుల వినియోగం, ఆయిల్ గింజ గ్రేడింగ్ తదితర విధానాలపై యాజమాన్య పద్ధతులను వివరిస్తున్నారు. గతంలో మార్కెట్ లేదని విడిచిన తోటలను నేడు పూత దశకు తీసుకొస్తున్నారు. ఇదంతా ప్రభుత్వ విధానాల వల్లనే జరుగుతుంది.

\-బి.అప్పలనాయుడు, హార్టికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్, చీడికాడ మండలం

కుటుంబమంతా ఆయిల్‌పామ్ సాగులోనే..



గతంలో కంటే ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. దీంతోపాటు మార్కెట్‌లో ధరలు పెరుగుదల రైతుకు లాభసాటిగా మారింది. మా కుటుంబం మొత్తం కలిసి 50 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలు నేరుగా మా రైతుల ఖాతాల్లోనే జమ అవుతున్నాయి. దీంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా లాభాలు చూస్తున్నాం.

\-బి.శ్రీనివాసరావు, ఆయిల్‌పామ్ రైతు, మంచాల గదబూరు

క్లుప్తంగా

కామాక్షమ్మ సేవలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్



శ్రీకాంతాచారిని సత్కరిస్తున్న ఆలయ సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక కామాక్షమ్మ అమ్మవారిని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంతాచారి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి అమ్మవారికి పూజలు చేయించి సత్కరించారు. శనివారం విశాఖలో జరిగే సంఘ సమావేశానికి వెళ్తూ మార్గమధ్యంలో అమ్మవారిని దర్శించుకున్నారని సంఘ సభ్యులు తెలిపారు.

పాలిసెట్ ఆప్షన్ల ఎంపిక

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల ప్రవేశానికి సంబంధించి వెబ్ ఆప్షన్ల ఎంపిక కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. అభ్యర్థులు వారి ఇంటి నుంచే నేరుగా ఇంటర్నెట్ ద్వారా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. వెబ్ ఆప్షన్లకు గడువు ఈ నెల 14వరకు ఉంది. 16న ఆప్షన్ల మార్పిడి చేసుకోవచ్చు. 18న సీట్ల కేటాయింపు, 19 నుంచి 23వ తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది.

మంచాల మోడల్ స్కూల్‌కు పురస్కారం

చీడికాడ: రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమంగా నిలిచినందుకు మంచాల మోడల్ స్కూల్ ఉత్తమ పురస్కారానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఈ నెల 15న విజయవాడలో పంద్రాగస్టు వేడుకల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నుంచి పురస్కారాన్ని స్వీకరిస్తామన్నారు. తమ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కృషి వల్లే గుర్తింపు లభించిందని, వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ హోంగార్డుకు గాయాలు

అనకాపల్లి టౌన్: విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు నాగరాజును స్థానిక నెహ్రూ చౌక్‌లో శుక్రవారం క్యాబ్ ఢీకొంది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక విద్యలో అధ్యాపకుల పాత్ర కీలకం

- వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ అచ్చయ్య





సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రభూషణరావు, జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ అచ్చయ్య

అనకాపల్లి టౌన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించడంలో అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకమైనదని వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.అచ్చయ్య తెలిపారు. స్థానిక డైట్ కళాశాలలో ఆధునాతన విద్యా ప్రమాణాలు, బోధన పద్ధతులపై రెండు రోజుల సెమినార్ కార్యక్రమాన్ని శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన బోధనతో విద్యార్థులకు మేలు కలుగుతుందన్నారు. మొదటి రోజు 'హోలిస్టిక్ టీచింగ్ అండ్ లెర్నింగ్ మెథడ్స్'అనే అంశాలపై ఆయన వివరించారు. జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కె.చంద్రభూషణరావు మాట్లాడుతూ విద్యారంగంలోని గొప్ప ప్రముఖుల ఉల్లేఖనాలను ఉటంకిస్తూ సంపూర్ణ బోధన ద్వారా సాహిత్యపరమైన అర్థాన్ని విశదీకరించడం కొనసాగించడం అన్నారు. 'హోలిస్టిక్ ఎడ్యుకేషన్' అనేది బోధనకు సమగ్రమైన విధానమన్నారు. విద్యావేత్తలు విద్యార్థుల భావోద్వేగ, సామాజిక, నైతిక, విద్యా, ఆధ్యాత్మిక అవసరాలను సమగ్ర అభ్యాస ఆకృతిలో పరిష్కరించడానికి ప్రయత్నిస్తారన్నారు. అనుకూల పాఠశాల వాతావరణాలపై దృష్టి సారించడం, విద్యార్థులకు పూర్తి చైల్డ్ సపోర్టులు (విద్యాపరమైన, నేక్ అకాడమిక్ అవసరాలకు మద్దతు ఇచ్చే సేవలు, సపోర్టు) అన్నారు. ఏయూ ప్రొఫెసర్ చల్లా నరసింహం మాట్లాడుతూ బ్లూమ్స్ టాక్సానమీ అనేది విద్యార్థుల విద్యా విషయాలు, సామాజిక అవసరాలపై దృష్టి సారించే బోధనకు ఒక విధానమని వివరించారు. అధ్యాపకులు వారి జీవితంలోని సవాళ్లను ఎదుర్కొనే సరైన పద్ధతులను బోధించడం ద్వారా వారి విద్యా అవసరాలను తీర్చడానికి ప్రయత్నిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, అకాడమిక్ డీన్ డాక్టర్ కె.పార్వతి, వివిధ విభాగాధిపతులు కె.సుజాత, ఏఎస్.గోపాలమ్మ, పి.పూర్ణప్రియ, పి.బి.రాయ్‌కుమార్, ఎస్.రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోరం ద్వారా విద్యుత్ సమస్యలకు పరిష్కారం

- ఫోరం చైర్మన్ సత్యనారాయణ



ఫోరం సభ్యులకు సమస్యలపై వినతి పత్రం అందిస్తున్న వినియోగదారులు

యలమంచిలి : విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఫోరం ద్వారా కృషి చేస్తున్నట్టు విద్యుత్ వినియోగదారు సమస్యల పరిష్కార న్యాయస్థానం (ఫోరం) చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం యలమంచిలి పట్టణం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంపై అవగాహన సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యవైఖరి అవలంభించిన సందర్భాల్లో వినియోగదారులు తమ సమస్యలను న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ముందుగా వారి ప్రాంతంలో ఉన్న విద్యుత్ కార్యాలయంలోని అసిస్టెంట్ ఇంజినీరు స్థాయి అధికారికి ఫిర్యాదు చేయాలని తెలిపారు. 1912 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.సిబ్బంది నిర్లక్ష్యం వహించి, సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే న్యాయస్థానంలో సంప్రదించాలని చెప్పారు.

అటువంటి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వినియోగదారులకు సత్వర న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం యలమంచిలి పట్టణంలో ఉన్న విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, ఆర్.సురేంద్రకుమార్,విద్యుత్ ఉద్యోగలు,సిబ్బంది పాల్గొన్నారు.

కొండలు, గుట్టలు దాటి.. గిరిజన పాఠశాలకు చేరి!



దట్టమైన అటవీ ప్రాంతంలో కాలినడకన నేరెళ్ల పూడి పాఠశాల సందర్శనకు బయలుదేరిన ఎంఈవో-2 ఉషారాణి

- దేవరాపల్లి ఎంఈవో-2 ఉషారాణి సాహసం



నేరెళ్లపూడిలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఈవో-2 ఉషారాణి

దేవరాపల్లి: గిరిజన పంచాయతీ చింతలపూడి శివారు నేరెళ్లపూడికి కనీస రహదారి సౌకర్యం లేదు. అయినప్పటికీ అక్కడకు వెళ్లేందుకు ఎంఈవో-2 వి.ఉషారాణి పెద్ద సాహసమే చేశారు. రెండు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి కొండలు, గుట్టలు ఎక్కి, గెడ్డలు సైతం దాటి చేరుకున్న తొలి మహిళా అధికారిగా ప్రశంసలు అందుకున్నారు. దేవరాపల్లికి దూరంగా దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న నేరెళ్లపూడి ప్రాథమిక పాఠశాలకు అతికష్టం మీద చేరుకుని పలువురి మన్ననలు పొందారు. గురువారం సమ్మెద వరకు ద్విచక్ర వాహనంపై చేరుకుని అక్కడి నుంచి స్థానిక ఉపాధ్యాయుడు జగదీశ్వరరావు సహకారంతో శారదానదిలో దిగి అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. అక్కడ నుంచి గ్రామంలో రచ్చబండ వద్ద చదువుకుంటున్న 22 మంది విద్యార్థులను కలిసి ఆమె ఆప్యాయంగా పలకరించారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న స్థానిక పాఠశాల భవనాన్ని పరిశీలించారు. నేరెళ్లపూడితోపాటు బోడిగరువు, మదనగరువు తదితర గ్రామాల విద్యార్థులు ఇక్కడే చదువుకుంటారని, పాఠశాల భవనాన్ని నిర్మించాలని గిరిజనులు కోరారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని ఇచ్చామని వివరించారు. నాడు-నేడు నుంచి రూ. 25 లక్షలు మంజూరయ్యాయని, త్వరగా నూతన పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంఈవో-2 హామీ ఇచ్చారు.

గల్లంతైన పోస్టుమాస్టర్ మృతదేహం లభ్యం



అప్పారావు మృతదేహం

కశింకోట: కశింకోట వద్ద ఏలేరు కాలువలో పోస్టు మాస్టర్ మృతదేహాన్ని గుర్తించి వెలికి తీసినట్లు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన కూనిశెట్టి అప్పారావు (62) అక్కడి సమీపంలోకి బహిర్భూమికని ఏలేరు కాలువకు వెళ్లగా, కాలు జారి కాలువలో పడిపోయి గల్లంతైన విషయం విదితమే. అక్కడ ఒడ్డున సైకిల్, పాదరక్షలు కనిపించాయి. ఉదయానికి మృతదేహం కొట్టుకొని కశింకోట వద్దకు చేరడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి ఇద్దరు ఆడ పిల్లలు, భార్య సత్యవతి ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేడపై నుంచి పడి వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్: తుమ్మపాల కొత్తపేట వీధికి చెందిన ఎం.బాబూరావు(42) తన మేడపై కాలుజారి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఆడపిల్లలు తులసీ, కరుణ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

మద్యం మత్తులో యువకుని వీరంగం

మునగపాక: మద్యం మత్తులో మునగపాకలో యువకుడు శుక్రవారం రాత్రి వీరంగం సృష్టించాడు. కనిపించిన కొంతమందిపై దాడి చేశాడు. బాధితులు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మునగపాక గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు రాత్రి బాహాటంగా మద్యం సేవిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పూచీకత్తులపై వారిని వదిలేశారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ముగ్గురు యువకుల్లో ఒకడు మద్యం ఎక్కువై దారిన పోయేవారిపై దాడి చేశాడు. ఈ దాడిలో ఒకరికి సంబంధించిన కళ్లద్దాలు పగులగొట్టడంతోపాటు జేబులను చింపివేశాడు. బైక్‌పై వెళ్తున్న మరొకరిపై చేయి చేసుకున్నాడు. సుమారు అర్ధగంట పాటు వీరంగం చేయడంతో స్థానిక యువకులు పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న యువకున్ని గదిలో ఉంచి వాతావరణం సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు.

ఆగస్టు 15 పరేడ్ రిహార్సల్ పరిశీలన



పరేడ్ రిహార్సల్‌ను పరిశీలిస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీసులు పరేడ్ కోసం విశాఖపట్నం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో రిహార్సల్ నిర్వహిస్తున్నారు. దీనిని శుక్రవారం ఆ జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయనకు ఇక్కడి సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 15 వేడుకలు అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దాని కోసం కవాతు బాగా జరపాలని రిహార్సల్ చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు పరేడ్ ఆకట్టుకునేలా రిహార్సల్ చేయాలని సిబ్బందికి సూచించారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఆర్ఐలు బి.రామకృష్ణారావు, కె.వెంకటరావు, ఎం.సతీష్, కె.అరవింద్ కిశోర్ పాల్గొన్నారు.

కల్తీకి పాల్పడితే చట్టపరమైన చర్యలు

- ఆహార కల్తీ నియంత్రణ జిల్లా అధికారి నందాజీ



రిలయన్స్ మార్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా అధికారుల బృందం

చోడవరం రూరల్: తాము సేకరించిన శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతామని, అక్కడ నివేదికలో కల్తీ జరిగినట్టు నిర్ధారణైతే చట్టపరమైన చర్యలు తప్పవని ఆహార కల్తీ నియంత్రణ జిల్లా అధికారి జి.ఎ.బి.నందాజీ స్పష్టం చేశారు. శుక్రవారం చోడవరం పట్టణంలోని రిలయన్స్ మార్ట్, శ్రీవెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్, ఉప్పల వెంకటేశ్వరరావు (ఆయిల్) హోల్‌సేల్ దుకాణాల్లో నందాజీ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల కల్తీతోపాటు, తూనికలు, కొలతలలో తేడాలను పరీక్షించామని, ఈ మేరకు శాంపిల్స్ సేకరించామన్నారు. రిలయన్స్ మార్ట్‌లో పప్పులు, మిగిలిన రెండు దుకాణాల్లోనూ శాంపిల్స్ సేకరించినట్టు తెలిపారు. వీటికి సంబంధించి ల్యాబ్ నుంచి వచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయన్నారు. ఆహార కల్తీ నియంత్రణ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్, తూనిక, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



గొర్లె రాజేశ్వరి(ఫైల్)

యలమంచిలి: మండలంలో పెద షేకిళ్లపాలెం గ్రామానికి చెందిన గొర్లె రాజేశ్వరి (25) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సన్నిబాబు శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన శ్రీనుతో ఆమెకు వివాహమైంది. భర్తతో మనస్పర్థలు రావడంతో తన పుట్టింటికి వచ్చి ఉంటోంది. ఇటీవల తన తల్లి లక్ష్మితో గొడవ పడి గత నెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తిరుపతి యాత్రకు వెళ్లి..



కైచర్ల శ్రీరామ్మూర్తి

కె.కోటపాడు: తిరుపతి యాత్రకు వెళ్లిన భర్త ఇంటికి తిరిగి చేరుకోకపోవడంతో శుక్రవారం ఎ.కోడూరు పోలీసులకు అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు చేసింది. ఎ.కోడూరు గ్రామానికి చెందిన కైచర్ల శ్రీరామ్మూర్తి (59) గత నెల 16న ఇంటి నుంచి తిరుపతి యాత్రకు ఏటా మాదిరిగానే ఒక్కడే బయలుదేరి వెళ్లాడు. 25 రోజులు గడుస్తున్నా జాడ లేకపోవడంతో ఆందోళన చెందినామె పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు.

జెట్టీ స్థలాన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు



జెట్టీ నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్నఅధికారులు



ఫిష్‌ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌డీసీ జ్ఞానవేణి

నక్కపల్లి: మండలంలో దొండవాక, చందనాడ గ్రామాల పరిధిలో జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల స్థలాలను శుక్రవారం ఉన్నతాధికారులు పరిశీలించారు. ఎన్ఏవోబీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, మెరైన్ అసిస్టెంట్ కమిషనర్ శివశంకర్, మత్స్యశాఖ అధికారులతో కలిసి తీర ప్రాంతాల్లో పర్యటించారు. పాయకరావుపేట నియోజకవర్గానికి ప్రభుత్వం ఫిష్ ల్యాండింగ్ సెంటరు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసి చాలా రోజులు గడిచిపోయింది. మత్స్యకారుల కోసం రూ.24 కోట్లతో పదెకరాల స్థలంలో నిర్మించనున్నారు. దొండవాకలో జెట్టీని, చందనాడ సమీపంలో ఫిష్‌ల్యాండింగ్ సెంటరును నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఎంపిక చేశారు. వీటిని గతంలో కలెక్టర్, జేసీ, మత్స్యశాఖ నిపుణులు పరిశీలించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సైతం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో త్వరగా పనులు ప్రారంభించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ప్రతిపాదిత స్థలాలను అధికారుల బృందం పరిశీలించింది. సర్వే నంబర్లు, విలేజ్ మ్యాప్, అనుకూల ప్రతికూలతలపై స్థానిక మత్స్యకారులతో చర్చించింది. తుది నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని వారు తెలిపారు. తహసీల్దార్ ఎస్.వి. అంబేడ్కర్, సర్వేయర్ మూర్తి, మత్స్యకార నాయకుడు మేరుగు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కుసుమ హరనాథ్ ఆలయంలో భజనలు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం కోటవీధిలోని కుసుమ హరనాథ్ దేవాలయంలో శనివారం ఉదయం 5 నుంచి సాయంత్రం 6 వరకూ 44వ చాతుర్మాస దీక్ష సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం ప్రచార కార్యదర్శి ఎస్.ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భజన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

జలమే జీవనాధారం


నూకరాజును సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: ప్రకృతిలో జీవరాసులన్నింటికీ నీరే ఆధారమని, అలాంటి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ శరగడం నూకరాజు సూచించారు. గాంధీనగరం లయన్స్ క్లబ్ ఆవరణలో శుక్రవారం జలమే జీవనాధారం అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నీరు లేనిదే భూమిపై జీవం ఉనికి ఉండదన్నారు. మానవ శరీరంలో ప్రతి అవయవం పనిచేయాలంటే రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు రోజూ తాగాలన్నారు. అంతకు ముందు ఆయనకు అభినందన సత్కారం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరాజు, సభ్యులు రత్నాజీరావు, శంకరరావు, మైఖేల్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఢీకొన్న ఆర్టీసీ బస్సు, లారీ


కశింకోట పోలీస్ క్వార్టర్స్ వద్ద ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

కశింకోట: స్థానిక పోలీస్‌క్వార్టర్స్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సుకు పెద్ద ప్రమాదం తప్పింది. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, అదే మార్గంలో వస్తున్న లారీ పక్కగా ఢీకొన్నాయి. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. బస్సు పక్క, ముందు భాగాలు దెబ్బతిన్నాయి. దీనిపై ఇంకా తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
భోళాశంకర్	:	సత్యనారాయణ స్క్రీన్-1
ఉస్తాద్	:	సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:	షిర్డిసాయి
భోళాశంకర్	:	పర్తిసాయి
భోళాశంకర్	:	వెంకటేశ్వర
భోళాశంకర్	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 74 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-----	-----
రెండో రకం	3,870	4,410
మూడోరకం	3,750	3,850

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 398 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

జామ.. ఆరోగ్య ధీమా

కాలంతో సంబంధంలేకుండా దాదాపు ఎక్కడైనా, ఎప్పుడైనా దొరికే పండ్లలో జామ ఒకటి. రుచితోపాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు జామ సొంతం. ధర విషయంలోనూ ఇతర పండ్లతో పోలిస్తే తక్కువ కావడంతో వీటిని తినేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. మార్కెట్‌లో ఉదయాన్నే తాజా జామకాయలు నిగనిగలాడుతూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి.

- రోజూ ఒక కాయ తింటే ఆరోగ్యానికి మేలు
- మార్కెట్‌లో విరివిగా లభిస్తున్న తాజా కాయలు


పట్టణంలోని చోడవరం రహదారిలో విక్రయానికి ఉంచిన తాజా జామకాయలు

అనకాపల్లి రూరల్: సామాన్యుల నుంచి సంపన్నుల వరకు జామకాయలు, పండ్లను ఇష్టంగా తింటారు. అనకాపల్లి పట్టణంతోపాటు, మండలంలో హైబ్రీడ్, నాటు రకాలకు చెందిన జామ లభిస్తుండడంతో వినియోగదారులు పోటీపడి కొంటున్నారు. మార్కెట్‌లో డజను ధర రూ.100 నుంచి రూ.150 వరకు పలుకుతోంది. రాజమండ్రి ప్రాంతానికి చెందిన హైబ్రీడ్ రకాలతోపాటు ఏజెన్సీ, స్థానిక తోటల నుంచి లభించే నాటు జామకాయలు మార్కెట్లో పుష్కలంగా లభిస్తున్నాయి.

పోషకాలు బోలెడు

జామతో అనేక వ్యాధులు దూరమవుతాయి. రోజూ తినడం ద్వారా శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించి ప్రొటీన్లను పెంచుతుంది. జామలో కొవ్వు, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఫలం. జామకాయలో పోషకాలు, విటమిన్లు, పీచు పదార్థం వంటి గుణాలవల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులు తినే పండ్లలో జామదే అగ్రస్థానం. ఈ పండులో 20% ఫోలేట్ వుండటంతో స్త్రీల నెలసరి సమస్యల పరిష్కారానికి బాగా ఉపయోగపడుతుందని వైద్యులు చెప్తున్నారు. పింక్ కలర్ జామపండులో ఉండే లైకోపీన్ చర్మ రక్షణకు, ప్రోస్టేట్ క్యాన్సర్ నివారణకు దోహదపడుతుంది. 1 జామపండు 10 ఆపిల్స్‌తో సమానమని ఆహార నిపుణులు చెబుతున్నారు. అందువల్లనే జామను పేదవాడి ఆపిల్‌గా వ్యవహరిస్తారు.

ఆరోగ్యానికి జామ ఆకులు

జ్వరం, దగ్గు, జలుబు వంటి సాధారణ సమస్యలకు జామ ఆకులు బాగా పనిచేస్తాయి. అతిసారం, నరాల బలహీనతలను నివారిస్తుంది. జామ ఆకులను వేడినీటిలో ఉడకబెట్టి టీ తయారు చేసుకుని తాగేవాళ్లు చాలా మంది ఉన్నారు. ఈ ఆకుల్లో యాంటీ ఇంఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలవల్ల జుట్టు రాలడాన్ని తగ్గించి, వెంట్రుకల కుదుళ్లను బలోపేతం చేస్తుందని నిపుణులు చెప్తున్నారు.

తప్పనిసరిగా కొంటాం



జామ కాయల్ని మార్కెట్‌కు వెళ్లిన ప్రతిసారీ తప్పనిసరిగా కొంటాం. ఆపిల్‌తో పోలిస్తే ధర చాలా తక్కువ. డజను ఆపిల్స్ కొనాలంటే రూ.250 పైమాటే. హైబ్రీడ్ కన్నా నాటు జామకాయల రుచి బాగుంటుంది. ఇంటి ముంగిట ఖాళీ స్థలం ఉంటే జామ చెట్లను పెంచి, ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

– పల్లా సతీష్, హరిపురం జంక్షన్

జామకాయల విక్రయంతో ఉపాధి



తాజా జామ కాయలకు డిమాండు ఎక్కువ. 20 ఏళ్ల జామకాయలు విక్రయిస్తున్నాను. తాజా జామ పండ్లు ఎక్కువగా సేల్ అవుతాయి. ఈ సీజన్‌లో వ్యాపారం బాగా సాగుతోంది. వీటి అమ్మకాలతోనే ఉపాధి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మితే రూ.500–800 ల వరకు మిగులుతోంది.

– పిల్లా కాశీ, వ్యాపారి, అనకాపల్లి

సుగర్ రోగులకు మంచిది



క్రమం తప్పకుండా రోజూ జామ పండ్లను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ముఖ్యంగా డయాబెటిక్ రోగులకు జామపండ్లు ఔషధంగా ఉపయోగపడతాయి. జామలో ఎక్కువ ఫైబర్, తక్కువ గ్లైసెమిక్ కారణంగా సుగర్ వ్యాధిగ్రస్తులకు మంచి ఆహారం. దోర జామ పండులోని వగరు దంతాలను శుభ్రం చేయడంతోపాటు, చిగుళ్ల నుంచి రక్తస్రావాన్ని నివారిస్తుంది. ఇందులో పుష్కలంగా వుండే పొటాషియం గుండె ఆరోగ్యాన్ని భద్రంగా చూసుకుంటుంది.

–ఎస్‌కే షమీమ్, వైద్యాధికారిణి, తుమ్మపాల పీహెచ్‌సీ

నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ వెంకటరమణ


కశింకోట కోనేరు వద్ద మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి

అనకాపల్లిటౌన్: జీవితంలో ప్రతీ రోజు, ప్రతీ క్షణం, శరీరంలోని ప్రతి అణువు మాతృభూమి కోసం త్యాగం చేసిన స్వాతంత్య్ర సమరయోధులు నడిచిన బాటలో సాగడమే, మనం వారికిచ్చే నిజమైన నివాళి అని జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా స్థానిక జీవీఎంసీ పెద్దహైస్కూల్(మెయిన్)లో జరిగిన నా భూమి–నాదేశం కార్యక్రమంలో పాల్గొని, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ మహోత్సవ్ వేడుకలు ఈ నెల 15వ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కార్యక్రమంలో హాజరయ్యే ప్రజలతో పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేయించాలని, పంచ ప్రాణ్ భావనను మనసు మూలల్లో చేరేందుకు ప్రతిజ్ఞ చేసేటపుడు మట్టి దీపాన్ని చేతిలో ఉంచుకోవాలన్నారు. అంతకు ముందు అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రుధిరా రాణి, జీవీఎంసీ ఏపీడీ వి.కె.దొర, ఉపాధ్యాయులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక కోనేరు వద్ద నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. మన నేల కోసం, దేశం కోసం త్యాగం చేసిన వ్యక్తుల్ని స్మరించుకుంటూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని గ్రామాల్లో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా శుక్రవారం మండలంలోని సంపతిపురం, మెట్టపాలెం, వీజే పురం, సత్యనారాయణపురం గ్రామాల్లో స్వాతంత్య్ర సమరయోధులకు గుర్తుగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. కొన్ని చోట్ల మొక్కల్ని నాటారు. ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్య్రం కోసం అసువులు బాసిన వీరులకు వందనం చేస్తూ, నివాళులర్పించారు. అమర వీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కే ధర్మారావు, ఉపాధి పథకం ఏపీవో సుప్రియ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమణాజీ, శంకర్, గ్రామాల్లో స్థానిక నాయకులు, యువత పాల్గొన్నారు.


సంపతిపురంలో మొక్కలు నాటుతున్న అధికారులు

సచివాలయాలతో ప్రజల చెంతకే సేవలు

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ అందిస్తున్న సేవలు ప్రజల్లో చిరకాలం నిలిచిపోతాయని జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి అన్నారు. సబ్బవరంలోని శివాలయం వద్ద ఆయన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల గురించి మాట్లాడారు. కరోనా వ్యాక్సిన్ వేసుకోవడానికి అపోహతో ప్రజలు ముందుకు వచ్చేవారు కాదన్నారు. అలాంటి సమయంలో వలంటీర్లు,సచివాలయ సిబ్బంది ధైర్యంగా ముందుకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకోవడంతో వ్యాక్సినేషన్‌కు విపరీతమైన డిమాండ్ పెరిగి విజయవంతంగా పూర్తయ్యిందన్నారు. కరోనా మరణాలు మన రాష్ట్రంలో తక్కువగా నమోదయ్యాయని చెప్పారు. వలంటీర్లు ఇంటింటికీ సర్వే నిర్వహించి కోవిడ్ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి సోకినవారిని వేరు చేయడం వల్ల విస్తరించకుండా నివారించగలిగామన్నారు. అలాగే ప్రభుత్వ అమలు చేస్తున్న నవరత్న పథకాలు ప్రజల చెంతకే చేరడానికి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థే కారణమన్నారు.ఇదే స్ఫూర్తితో వలంటీర్లు,సచివాలయ సిబ్బంది మరింత సమర్థంగా పనిచేయాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం చెల్లించాలి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ప్రమాదంలో మృతి చెందిన ఒక్కో కార్మికుడి కుటుంబానికి రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పరవాడ సినిమా హాలు కూడలి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. అంతకు ముందు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని గనిశెట్టి పరామర్శించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఎన్టీపీసీ యాజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. నిర్వహణ కూడా సక్రమంగా లేక ట్రాక్ వే కూలిపోయి ఇద్దరు కార్మికుల మరణానికి కారణమైందన్నారు. యాజమాన్యం పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు


పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం


మునగపాక: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని ప్రముఖ సైకాలజిస్టు జె.ఎస్.వి. రావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తోసా(తిమ్మరాజుపేట ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల పిల్లలకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదువుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సర్పంచ్ భీమిశెట్టి లక్ష్మణరావు,ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ ,పంచాయతీ రాజ్ విశ్రాంత ఈఈ భీమిశెట్టి గణేశ్వరరావు,విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కెమికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ భీమిశెట్టి లక్ష్మణరావు, హైస్కూల్ హెచ్ఎం జి.అప్పారావు,పీఎంసీ చైర్మన్ కర్రి కృష్ణ,తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు,కమిటీ సభ్యులు దివాకర్,శివాజీ, శ్రీ మన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల జరిగిన పదవతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఈ-పంట నమోదుపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు

మునగపాక: ఈ పంట నమోదుపై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు సూచించారు. స్థానిక ఆర్‌బీకేలో శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఈ పంట నమోదు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. సీజన్‌కు అవసరమయ్యే ఎరువులు,విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, ఏఈవో లక్ష్మిశ్రీ, వీపీఏ రవిరాజ్, రైతుసంఘ అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

ఓటరు సర్వేపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక: ఓటరు సర్వేపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో పార్టీ ప్రజా ప్రతినిధులు,బీఎల్ఏలతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు,ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశిబాబు,సచివాలయ కన్వీనర్‌లు బొడ్డేడ మహేష్,బొడ్డేడ అప్పలనాయుడు,పార్టీ నాయకులు వేగి కృష్ణ, ఆడారి సంతోష్‌కుమార్,శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతపై భావి తరాలకు స్ఫూర్తి


విశ్రాంత జవాన్లను సత్కరిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి తదితరులు

సబ్బవరం: దేశ సమగ్రత, సౌభ్రాతృత్వంపై భావితరాలకు స్ఫూర్తిని కలిగించడమే నా భూమి–నాదేశం కార్యక్రమం ఉద్దేశ్యమని జిల్లా పరిషత్ సీఈవో పి. శ్రీరామమూర్తి అన్నారు. మండలంలోని సబ్బవరం శివాలయాన్ని ఆనుకుని ఉన్న ధర్మకోనేరు వద్ద శుక్రవారం నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారతావని 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాభూమి–నాదేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతోందన్నారు. వివిధ సాయుధ దళాల్లో పనిచేసి రిటైర్ అయిన వారిని సన్మానించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీడీవో రమేష్ నాయుడు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి వాహనాల రాకపై నియంత్రణ


కార్యాలయం గేట్ల మధ్య నుంచి బయటకు వస్తున్న వ్యక్తి

అనకాపల్లిటౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రధాన ద్వారానికి తాళం పడడంతో బయట వాహనాలకు ప్రవేశం లేకుండా పోయింది. కార్యాలయం ఆవరణలో ఉన్న ఖాళీస్థలాన్ని పలువురు పార్కింగ్‌గా మార్చేశారు. ఇది గమనించిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రధాన ద్వారానికి తాళం వేశారు. కార్యాలయ ఆవరణలోకి బయటి వాహనాలు రాకుండా చర్యలు తీసుకున్నారు. కార్యాలయ పనులపై వచ్చేవారికి మాత్రమే ప్రవేశమంటూ, ప్రధాన గేటు ద్వారా ఒక మనిషి మాత్రమే వెళ్లేందుకు వీలుగా దారి ఉంచారు.

కుళాయి నీటి సరఫరా బంద్


మేదర వీధిలో నీరు రాక వెలవెల బోతున్న వీధి కుళాయి

కశింకోట: స్థానిక పంచాయతీ పరిధిలో రెండు రోజులుగా వీధి కుళాయిల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ప్రజల అవసరాలకు కుళాయి నీరే ప్రధాన ఆధారం. పైపులైన్ మరమ్మతులకు గురు, శుక్రవారాల్లో నీరు సరఫరా చేయలేదు. ఇంటింటి కుళాయిల నుంచి అక్కడక్కడ అరకొరగా నీరు సరఫరా చేశారు. అందుబాటులో ఉన్న వారు ఆ నీటిని సేకరించారు. వీధి కుళాయిల నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్‌ను సంప్రదించగా తాగునీటి పైపులైన్ దెబ్బతినడంతో మరమ్మతులు చేపడుతున్నామని, వాటిని పూర్తి చేసి శనివారానికి వీధి కుళాయిల ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి మండల పరిషత్ నిధులు


అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ప్రస్తుతం అందిస్తున్న వైద్య సేవలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రి అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నిర్వహణకు అవసరమైతే మండల పరిషత్ నిధులు కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, పీహెచ్ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తు పోస్టల్ ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగానికి ప్రతీకగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పోస్టల్ సూపరింటెండెంట్ జె.ప్రసాద్ బాబు తెలిపారు. పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా స్థానిక ఉడ్‌పేట ప్రధాన తపాలా కార్యాలయం నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. నెహ్రూచౌక్, చిన నాలుగు రోడ్ల కూడలి, రింగ్‌రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి, తిరిగి తపాలా కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కార్యాలయంలో రూ.25కే జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో చురుగ్గా సీసీ రోడ్లు


హౌసింగ్ కాలనీలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

కశింకోట: ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి కేటాయించిన రూ.35 లక్షల ఎంపీ నిధులతో స్థానిక హౌసింగ్ కాలనీలో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనుల్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఎంపీ నిధుల మేరకు నిర్మాణ పనులు పూర్తి చేసి, మిగిలిన రోడ్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కేటాయించే నిధులతో పూర్తి చేయనున్నట్లు మీడియాకు ఎంపీపీ తెలిపారు. పనుల్లో వేగవంతానికి కాంక్రీట్ మిక్సర్ వినియోగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.